క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నివాసంలో ఓదెల మండలానికి చెందిన ఇద్దరికి ఎమ్మెల్యే ఎల్‌వోసీ అందజేశారు. ఓదెల మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన తుమ్మ సదానందం అనారోగ్యంతో బాధపడుతుండగా సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2లక్షల ఎల్‌వోసీ, గూడెం గ్రామానికి చెందిన బేతి రవీందర్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.లక్ష ఎల్‌వోసీ వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన



అభినందిస్తున్న డిప్యూటీ ఆర్‌ఎం భూపతిరెడ్డి

మంథని: మేడారం జాతర సందర్భంగా విధులు సక్రమంగా నిర్వహించిన ఉద్యోగులను ఆర్టీసీ కరీంనగర్ డిప్యూటీ ఆర్‌ఎం భూపతిరెడ్డి అభినందించారు. మంగళవారం మంథని బస్ డిపోను సందర్శించిన డిప్యూటీ ఆర్‌ఎం ఐదు రోజుల పాటు ప్రత్యేకంగా నడిపిన బస్సుల్లో విధులు నిర్వర్తించిన ఉద్యోగులు, అధికారులను కలిసి స్వీట్లు పంచారు. డిపో మేనేజర్ రాజశేఖరం, సీఐ ఏంజలీ, ఏడీసీ సూపరింటెండెంట్ ప్రసన్న, కంట్రోలర్ ఏడీసీ బాలయ్య, బస్టాండ్ కంట్రోలర్ కేకే రెడ్డి ఉన్నారు.

ఓటు ప్రజాస్వామ్య హక్కు

జ్యోతినగర్: ఓటు ప్రజాస్వామ్య హక్కు అని నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని ఓ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా యువత ఓటుహక్కు వినియోగించుకోవడంతో పాటు ప్రతి ఒక్కరికీ ఓటు ప్రాధాన్యత వివరించాలని సూచించారు.

టీబీ నియంత్రణపై అవగాహన

గోదావరిఖనిటౌన్: వైద్యారోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లాను టీబీ రహిత జిల్లాగా మార్చేందుకే విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని స్థానిక అడ్డగుంటపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మణికేశ్వర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని మహర్షి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన టీబీ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీబీ వ్యాధి చికిత్స పర్యవేక్షకులు తోట గోపీకృష్ణ, హెల్త్ విజిటర్ శ్రావణి, సూపర్‌వైజర్ అనిత, కళాశాల ప్రిన్సిపాల్, మెడికోలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



రేకుర్తి ఆసుపత్రికి పంపిస్తున్న క్లబ్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో లయన్స్ క్లబ్ ఆఫ్ శాతకర్ణి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నంచి హాజరైన వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 45 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారని క్లబ్ అధ్యక్షుడు గుంటి కుమార్ తెలిపారు. వారందరినీ ఉచితంగానే రేకుర్తి ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు సంపత్‌రావు, నరసింగం, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, రవికుమార్, బత్తుల శ్రీనివాస్ ఉన్నారు.

హౌస్ వైరింగ్ కేబుల్ చోరీపై ఫిర్యాదు

జ్యోతినగర్: నిర్మాణంలో ఉన్న ఇంటి వైరింగ్ కేబుల్ చోరీపై ఎన్టీపీసీ పోలీసులకు బాధితుడు నాగుల మల్యాల బ్రహ్మం మంగళవారం ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగపుత్ర సొసైటీ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లోని హౌస్‌వైరింగ్ కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి తీసుకెళ్లారని ఫిర్యాదు చేశాడు.

ఓటుహక్కుపై అవగాహన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, కుందనపల్లి కేజీబీవీల్లో మంగళవారం ఓటు ప్రాధాన్యం, ఓటుహక్కు వినియోగం తదితర అంశాలపై విద్యార్థినులకు ఎంపీడీవో అలీం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటుహక్కు వినియోగంపై విద్యార్థినుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో ప్రత్యేకాధికారులు తౌటం కల్పన, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

'పోలియో' విజయవంతానికి చర్యలు

- జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కేంద్రాలు 400
- ఐదేళ్లలోపు పిల్లలు 67,539
- మార్చి 3న కార్యక్రమం ప్రారంభం



సమీక్ష సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు

సుల్తానాబాద్: పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి ఆరోగ్య కేంద్రాలతో పాటు డాక్టర్లతో ఇటీవల ఉన్నతాధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మార్చి 3వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కోసం ఇప్పటికే అధికారులు పిల్లల సంఖ్యకు అదనంగా పల్స్ పోలియో డ్రాప్స్ స్టాక్ తెప్పించారు. అంగవైకల్యం రాకుండా ఉండేందుకు పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదేళ్ల వరకు ఉన్న పిల్ల లకు పల్స్ పోలియో డ్రాప్స్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటీవల డాక్టర్లతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లావ్యాప్తంగా..

జిల్లాలో 266 గ్రామపంచాయతీలు ఉండగా 17 పీహెచ్‌సీలు, 6 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు జిల్లా కేంద్ర ఆస్పత్రి మంథని, సుల్తానాబాద్ సీహెచ్‌సీలు ఉన్నాయి. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 67,539 మందిని గుర్తించారు. జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కేంద్రాలు 400 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, ముఖ్య కూడళ్లతోపాటు ఇటుక బట్టీలు, పరిశ్రమల ప్రాంతాలను గుర్తించారు. మార్చి మూడో తేదీన పల్స్ పోలియో కేంద్రాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం7 నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తారు.

హౌస్ టు హౌస్ పంపిణీ

మార్చి 4 ,5 తేదీల్లో పోలియో కేంద్రాలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడీ ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని, ఇంటింటా తిరిగి పిల్లలకు పల్స్ పోలియో డ్రాప్స్ వేయనున్నారు. వాటితో పాటు పలు రకాల పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాల పిల్లలు ఉన్నందున వారికి సైతం పల్స్ పోలియో డ్రాప్స్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

అందరూ సహకరించాలి



జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కేంద్రాలతో పాటు ప్రణాళికలు సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించాం. పల్స్ పోలియో డ్రాప్స్ అర్హులైన పిల్ల లందరూ వేయించుకునేలా ప్రజలందరూ కృషి చేయాలి. అంగవైకల్యం ఉండకుండా ఉండేందుకు పల్స్ పోలియో డ్రాప్స్ ఉపయోగపడతాయి. పోలియో రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలి.

– డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, పెద్దపల్లి

అందుబాటులో పోలియో డ్రాప్స్



పల్స్ పోలియో వ్యాక్సిన్ 30 నిల్వ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఐదేళ్లలోపు పిల్లలను 67,539 మందిని గుర్తించాం. ఇప్పటికే ఏఎన్‌ఎం, ఆశావర్కర్లకు, అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చాం. నోటి ద్వారా వేసే పోలియో వ్యాక్సిన్ అర్హులందరూ వినియోగించుకునేలా చూడాలి.

– డా.కృపబాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, పెద్దపల్లి

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

మంథని: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. బుధవారం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మంథనిలో ప్రభుత్వ బాలికలు, బాలుర కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలికల, బాలుర, గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. బాలికల కళాశాలలో 201, బాలుర కళాశాలలో 176 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని, 30 నిమిషాలు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని బాలికల జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ సయ్యద్ సలీం తెలిపారు.



జూలపల్లి: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్షల నిర్వహణకు సిద్ధం చేస్తున్న అధికారులు



సుల్తానాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హాల్ టికెట్ నంబర్లు వేయిస్తున్న సీఎస్ మోరాజ్

జూలపల్లి: ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కేంద్రం డీవోఏ రాజేందర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 28 నుంచి మార్చి 16 వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8గంటలలోపు హాజరు కావాలని, సెల్‌ఫోన్స్, డిజిటల్ వాచీలు, బూట్లు, అనుమతించబోమని వివరించారు. ఆదర్శ, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ 340, ద్వితీయ 310 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. 18మంది ఇన్విజిలేటర్లు పర్యవేక్షణ చేస్తారని వివరించారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు. 180 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడొద్దని సూచించారు.

గంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి

సుల్తానాబాద్: ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి గంటముందే అనుమతించనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సీఎస్ మోరాజ్ తెలిపారు. మంగళవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హాల్‌టికెట్ నంబర్లను బెంచీలపై రాయించారు. సుల్తానాబాద్‌లో రెండు కేంద్రాల్లో 364మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు.

వన్ మినిట్ నిబంధన అమలు

గోదావరిఖనిటౌన్: నియోజకవర్గంలో ఏడు పరీక్షా కేంద్రాలను అధికారులు కేటాయించారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 1593 మంది, సెకండియర్ పరీక్షలకు 1688 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

కనుల పండువగా అయ్యప్ప శోభాయాత్ర



కోలాటం ఆడుతున్న మహిళలు

మంథని: మంథనిలోని అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని అందంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలకరించిన వాహనంలో స్వామిఉత్సవ విగ్రహాన్ని పట్టణ పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, అప్పయ్య భక్తుల నృత్యాలు అలరించాయి.

కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్ల కేటాయింపు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో మంగళవారం కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్ల కేటాయింపు నిర్వహించారు. స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో డీ, టీ–2, ఎస్టీటూ, ఎండీ టైప్ క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 87క్వార్టర్లను కౌన్సెలింగ్ ద్వారా కేటాయించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం, అధికారులు నరేశ్ చక్రవర్తి, సారంగపాణి, హనుమంతరావు, రవీందర్, గణేశ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో గ్రామాల అభివృద్ధి



కేంద్ర పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

ధర్మారం: బస్తీ సంపర్క్ అభ్యాన్‌లో భాగంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పత్తిపాక, నర్సింగపూర్, జక్కన్నపల్లి, మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటా తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చి ప్రధానిగా నరేంద్ర మోదీ అవుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సందనవేని లక్ష్మణ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మెడవేని శ్రీనివాస్, నాయకులు ఎల్లాల మహేందర్‌రెడ్డి, మణికంఠ, శ్రీనివాస్, సంతోష్, లచ్చయ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తికి చెందిన తూడి శంకర్ (43) అనే యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారంగా బొట్లవనపర్తికి చెందిన తూడి శంకర్ మద్యానికి బానిసై 23న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కథల పోటీల్లో ప్రతిభ



సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం రవీందర్

ధర్మారం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కథల పోటీల్లో ధర్మారం మండలం నర్సింహుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 79 మంది పాల్గొన్నారు. నర్సింహుపల్లి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వేల్పుల శ్రీలత ప్రథమ బహుమతి పొందగా, ఇదే పాఠశాల విద్యార్థి బొట్ల లక్ష్మి గణేశ్ ప్రోత్సాహక బహుమతి పొందారు. పోటీ నిర్వాహకులు గరిపెల్లి అశోక్ పంపించిన నగదు, ప్రశంస పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల రవీందర్ విద్యార్థులకు అందించారు.

ఎల్టా స్పెల్ విజార్డ్ కాంపిటీషన్‌లో జోషితకు రెండో స్థానం



జోషితకు బహుమతి ప్రదానం చేస్తున్న డైరెక్టర్లు

ధర్మారం: ఆంగ్లభాష ఎల్టా స్పెల్ విజార్డ్ కాంపిటీషన్‌లో మండలంలోని నందిమేడారం ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపెల్లి జోషిత రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఆడిటోరియంలో రాష్ట్ర ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంగ్లభాష స్పెల్ విజార్డ్ రాత పరీక్షలో ఎంపెల్లి జోషితకు 46/50 రాపిడ్ రౌండ్‌లో 13/15 మార్కులు సాధించినట్లు ఆంగ్ల ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థికి యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాధికారి నారాయణ, అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ అనంత లక్ష్మి, హెచ్‌వోడీ అనురాగ్, భారతి ఫౌండేషన్ చైర్మన్ ప్రణీత్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు.

మాజీ ఎమ్మెల్యే చందర్‌కు పితృవియోగం



మల్లయ్య(ఫైల్)

గోదావరిఖని: రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తండ్రి మల్లయ్య(82) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లోని తన నివాసం వద్ద మల్లయ్య పార్థివదేహాన్ని ఉంచారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణతోపాటు పలువురు పార్థివదేహం సందర్శించి నివాళి అర్పించారు. మల్లయ్య సింగరేణి కార్మికుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

ఇద్దరికి చూపు ఇచ్చిన మల్లయ్య

మల్లయ్య మరణంలోనూ మరో ఇద్దరికి చూపు ఇచ్చారు. తండ్రిని కోల్పోయిన దుఃఖంలో ఉన్న చందర్ తన తండ్రి నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. లయన్స్‌క్లబ్, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ ద్వారా హైదరాబాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు.

పోలీసు వాహనాలపై నిరంతర పర్యవేక్షణ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పోలీసు వాహనాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం హెడ్‌క్వార్టర్‌లో పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పనితీరు, వాటి నిర్వహణను పరిశీలించారు. ప్రజాసేవకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. వాహనాల నిర్వహణ లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదికను నెలవారీగా సమర్పించాలని ఎంటీవో అధికారులను ఆదేశించారు. వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచి కండిషన్లో ఉంచుకోవాలని డ్రైవర్లకు సూచించారు. పోలీసు అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సొంత వాహనంలా మంచి కండిషన్లో ఉంచి ఎప్పటికప్పుడు సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్, టైర్ల నిర్వహణ ఉత్తమ ప్రమాణాలను పాటించాలన్నారు. డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, రిజర్వ్ సీఐ దామోదర్, ఎంటీవో మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో మానేరు నుంచి రోజూ వందలాది లారీలు ఇసుక తరలిస్తుండడంతో రోడ్డు ప్రమాదం పొంచి ఉందని మంగళవారం స్థానికులు ఆందోళనకు దిగారు. నడవడానికి వీలు లేకుండా లారీలను రోడ్డుపై నిలపడంతో ఇబ్బందిగా ఉందని లారీలను అడ్డుకున్నారు. ఇసుక లారీలతో రోడ్డు ధ్వంసమై దుమ్ము, ధూళితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మానేరు ఇసుక రీచ్‌ల పేరుతో అక్రమ దందా నడుస్తోందని స్థానికులు వాపోయారు. సంబంధిత ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అల్లం కుమారస్వామి, శంకర్, జగన్ ఉన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



క్రీడాదుస్తులు అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థ క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు తెలిపారు. మంగళవారం ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి వివిధ క్రీడల్లో, రీజినల్ స్థాయి క్రీడల్లో పాల్గొన్న వివిధ గనులు, విభాగాలకు చెందిన క్రీడాకారులకు జీఎం క్రీడాదుస్తులు అందజేశారు. సింగరేణి సంస్థ క్రీడాకారులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, కోల్ ఇండియా స్థాయిలో రాణించి సంస్థ పేరును ఉన్నత స్థాయిలో నిలపాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, డీవైపీఎం గుర్రం శ్రీహరి, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి వి.సునీల్‌ప్రసాద్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనాలివ్వండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులకు వేతనంపై రూ.వెయ్యి పెంచుతూ ఉత్వర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం ఇస్తున్న తీరుగా ఇక్కడ కూడా కార్మికులకు రూ.21వేల వేతనం చెల్లించాలని కోరారు. నాయకులు సురేశ్, బొంకూరి సాగర్, సుద్దాల సతీశ్, రాజయ్య, మరియ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కార్మికులకు న్యాయం



కార్మికులతో మాట్లాడుతున్న శ్యామ్

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కార్మికులకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యాం అన్నారు. ఈ మేరకు ఆయన ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సింగరేణి కార్మికులను మంగళవారం కలిశారు. వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తాను పోటీలో ఉన్నానని, తనకు మద్దతుగా నిలవాలని కోరారు. ఎంపీ ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఆయన వెంట ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు మార్కండేయ, ప్రసాద్, లింగమూర్తి, సదయ్య, ఇస్మాయిల్, స్వామి, రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

గోలివాడ హుండీ ఆదాయం రూ.10లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న మహిళలు

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ సమ్మక్క – సారలమ్మ జాతరలోని హుండీల ఆదాయం మంగళవారం స్థానిక రామాలయంలో లెక్కించారు. మొత్తం 16 హుండీల ద్వారా రూ.10,36,780 నగదు, 1.200 మి.గ్రా. మిశ్రమ బంగారం, 500 గ్రాముల మిశ్రమ వెండి సమకూరాయి. చిరువ్యాపారాల ద్వారా రూ.11,57,675 ఆదాయం సమకూరిందని ఈవో కొండపర్తి రాజ్‌కుమార్ తెలిపారు. దేవాదాయ శాఖ ప్రతినిధి ఆర్.సుజాత, జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హన్మాన్‌రెడ్డి, ప్రతినిధులు కోల రామ్మూర్తిగౌడ్, పల్లికొండ తిరుపతి, ఆవుల గోపాల్‌యాదవ్, రాజరాజేశ్వర సేవాసమితి, మురళీకృష్ణ కోలాటానికి చెందిన 30మంది మహిళలు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్‌డేలో అధికారులు పాల్గొనాలి

జూలపల్లి: ప్రతి నెలా నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మామిడిపెల్లి చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ బషీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి మానుమండ్ల శ్రీనివాస్, సీపెల్లి గోపాలకృష్ణ, సంజీవ్, చంద్రమౌళి, మహేశ్, సంపత్, ధర్మయ్య, రాజు ఉన్నారు.